3న ప్రదర్శన, సభను విజయవంతం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - తణుకు

భీమవరంలో సిపిఎం జిల్లా మహాసభ సందర్భంగా జనవరి మూడో తేదీన నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్, పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక అమరవీరుల భవనంలో వల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రతాప్, అజయకుమారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నాయన్నారు. రైతు, కార్మిక చట్టాల మార్పు వల్ల దేశాభివృద్ధి తిరోగమనంలో పడుతుందన్నారు. పట్టణంలోని అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. తేతలి ప్రాంతంలో గోవధ వల్ల వస్తున్న దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వారి ఇబ్బందులు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం నేతలు గుబ్బల గోపీ, పిఎల్.నరసింహారావు, కె.నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

చి'వరి'లో టెన్షన్..!

పెదపాడు మండలంలో రోడ్డుపైన ఉన్న ధాన్యం రాశులను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జెడి హబీబ్ బాషా

ఖరీఫ్ మాసూళ్లు చివరి దశకు చేరినప్పటికీ ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. అల్పపీడన ప్రభావంతో సోమవారం నుంచి జిల్లాలో వర్షం, చలిగాలులతో వాతావరణంలో తీవ్ర మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో మిగిలిన ఖరీఫ్ ధాన్యం, రబీ నారుమడులను కాపాడుకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు.

అల్పపీడన ప్రభావంతో వర్షాలు, చలిగాలులు

ఆఖరు దశకు చేరిన ఖరీఫ్ మాసూళ్లు

రెండు జిల్లాల్లోనూ లక్ష టన్నుల వరకూ ధాన్యం కళ్లాల్లోనే

తడవకుండా ధాన్యం కాపాడుకునేందుకు అన్నదాత అవస్థలు

రబీ నారుమళ్లు, నాట్లతో రైతులు బిజీబిజీ

నారుమడులపై వర్షం ప్రభావం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలవ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఖరీఫ్ ఆరంభంలో విరుచుకుపడిన వరదలు, వర్షాలకు రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. మిగిలిన పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. ఖరీఫ్ కోతలు ప్రారంభమైన తర్వాత బంగాళాఖాతంలో ఏర్పడిన వరుస అల్పపీడనాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకూ మూడుసార్లు వాయుగుండాలు రైతులను వెంటాడాయి. అధికారుల లెక్కల ప్రకారం 90 శాతం వరకూ ఖరీఫ్ కోతలు, ధాన్యం విక్రయాలు పూర్తయ్యాయి. ఏలూరు జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ టార్గెట్ పెట్టుకోగా ఇప్పటి వరకూ 2.83 లక్షల మెట్రిక్ ధాన్యం కొనుగోలు చేయడంతోపాటు రైతుల ఖాతాల్లో రూ.585 కోట్లు వరకూ జమ చేశారు. మరో 55 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉన్నట్లు తెలుస్తోంది. పెదపాడు, ఏలూరు రూరల్ పరిధిలో 12 వేల మెట్రిక్ టన్నులు, పెదపాడు మండలంలో ఐదు నుంచి ఆరు వేల మెట్రిక్ టన్నులు, ముదినేపల్లిలో ఐదు వేల మెట్రిక్ టన్నులు, వేరే మండలాల్లో మరికొంత కుప్పలు, ధాన్యం రూపంలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు టార్గెట్ 4.10 లక్షల మెట్రిక్ టన్నులుండగా, ఇప్పటి వరకూ 3.70 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. మరో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకూ రైతుల వద్ద ఉన్నట్లు చెబుతున్నారు. నరసాపురం, ఆకివీడు, యలమంచిలి, ఆచంట వంటి మండలాల్లో ఇంకా ధాన్యం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అల్పపీడనం ప్రభావంతో రైతులు ధాన్యం కాపాడుకునేందుకు నానావస్థలు పడుతున్నారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడవకుండా టార్పలిన్లు వంటివి కప్పి ఉంచి కాపాడుకుంటున్నారు. ప్రస్తుతం చినుకులే పడుతుండటంతో ప్రస్తుతానికి కొంత పర్వాలేదని రైతులు చెబుతున్నారు. 28వ తేదీ వరకూ వర్షాల ప్రభావం ఉండనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

రబీ సాగుపై వర్షం ప్రభావం

ఖరీఫ్ మాసూళ్లు చివరి దశకు చేరుకోవడంతో రబీ సాగుపై రైతులు పూర్తిగా నిమగ్నమయ్యారు. రెండు జిల్లాలవ్యాప్తంగా రబీలో 3.50 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేవట్టారం. రెండు జిల్లాల్లో నారుమడులు దాదాపు పూర్తయ్యాయి. నాట్లు సైతం మొదలయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో మూడు వేల ఎకరాల్లో నాట్లు పూర్తవ్వగా, ఏలూరు జిల్లాలో 500 ఎకరాలకుపైగా నాట్లు పూర్తయ్యాయి. వర్షంతో నారుమడులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. నారుమడులు చివరిదశలో ఉండటంతో వర్షానికి మొలకలు దెబ్బతింటున్నట్లు అన్నదాత చెబుతున్నాడు. నాట్లు నాటేందుకు సైతం రైతులు వెనుకాడుతున్నారు. గతేడాది డిసెంబర్‌లో విరుచుకుపడిన భారీ వర్షాలతో నారుమడులు, నాట్లు నాటిన పొలాలు సైతం దెబ్బతిన్నాయి. దీంతో రెండోసారి నారుమడులు వేయాల్సి రావడంతో రైతులు ఆర్థికంగా తీవ్ర నష్టాలను చవిచూశారు. దీంతో అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

క్రీస్తు దయాగుణం ప్రతిఒక్కరూ ఆచరించాలి

సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి

క్రిస్మస్ పండుగ ప్రతి ఒక్కరి ఇంటిలో సంతోషాలు నింపాలి. ప్రేమ, త్యాగానికి ప్రతీకైన క్రీస్తు బోధనలు ప్రతిఒక్కరూ ఆచరించాలి. ప్రేమ, దయాగుణాన్ని ఇతరులకు పంచాలని క్రీస్తు ప్రజలకు బోధించడమే కాక జీవించి చూపారు. క్రైస్తవ సోదర, సోదరీమణులంతా క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య సంతోషంగా జరుపుకోవాలి.

శాంతిమార్గంలో పయనమే క్రిస్మస్ స్ఫూర్తి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

జిల్లా ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు. త్యాగం, ప్రేమ, కరుణ గొప్పతనాన్ని ఏసుక్రీస్తు తన బోధనలు ద్వారా విశ్వ మానవాళికి తెలిపారు. ఏసుక్రీస్తు ప్రపంచ సర్వమత శాంతి స్థాపనకు పుట్టిన మహనీయుడు, గొప్ప శాంతి దూత. శత్రువులను సైతం క్షమించమని చెప్పిన కరుణామూర్తి. ఆయన చూపిన శాంతి మార్గంలో పయనించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

మొగల్తూరులో కురుస్తున్న వర్షం

చలిగాలులు.. చిరుజల్లులు

ప్రజాశక్తి - పాలకొల్లు

తీవ్ర అల్పపీడన ప్రభావంతో పాలకొల్లులో మంగళవారం రెండవరోజు చిరుజల్లులు పడ్డాయి. వర్షం, ఈదురుగాలులు, చలిగాలులు, ఎండ ఇలా వాతావరణంలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. వాతావరణం ఆహ్లాదకరంగా ఉందని యువత కేరింతలు కొట్టారు.

మొగల్తూరు: వాతావరణంలో మార్పులతో వారం రోజులుగా మండలంలోని ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు. మంగళవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు చలి గాలులు వీచాయి. సాయంత్రం చిరుజల్లులు పడడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో రహదారులు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. దీంతో వ్యాపార దుకాణాలు కొనుగోలుదారులు లేక వెలవెలబోయాయి.

జీలుగుమిల్లి: అల్పపీడన ప్రభావంతో మండలంలో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు పడుతున్నాయి. దీంతో వరి, వేరుశెనగ పంటల రైతులు ఆందోళన చెందుతున్నారు. కామయ్యపాలెం, బర్రింకలపాడు, అంకంపాలెం గ్రామాల్లో పలు చోట్ల పనల మీదే పంటలు ఉన్నాయి. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఆడేసిన కాయలను బరకాలు కప్పి భద్రపరుచుకున్న రైతులు

పేదల ఇళ్లు కూల్చివేత తగదు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జె.సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం

పేదలతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

పాలకోడేరు శివారు అల్లూరి సీతారామరాజు నగర్‌లో పేదల ఇళ్లు కూల్చివేత యోచన తగదని, తక్షణం దాన్ని ఉపసంహరించుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పాలకోడేరు శివారు అల్లూరి సీతారామరాజు నగర్‌లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న పేదలతో సమావేశాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. సమావేశానికి పోరాట కమిటీ నాయకులు పెచ్చెట్టి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్ఆర్ నగర్‌లో 1989 నుండి ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారని, అనేక పోరాటాల ద్వారా మంచినీటి పైపులు, విద్యుత్, సిమెంట్ రోడ్ల సౌకర్యం సాధించుకున్నారని తెలిపారు. కొందరి ప్రయోజనాల కోసం పేదల ఇళ్లను తొలగించే ఆలోచన సరికాదన్నారు. పేదల ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తామని విద్యుత్ శాఖాధికారులు చెప్పడం తగదన్నారు. తమ గోడు ఎంఎల్ఎకు చెప్పుకునేందుకు వెళ్లే కనీసం స్పందించకుండా పైనుండి వచ్చిన ఆదేశాలంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం ఎంఎల్ఎ స్థాయికి తగదన్నారు. ఎవరైనా పేదల ఇళ్ల జోలికొస్తే కోర్టు ధిక్కరణ కేసులకు గురికావాల్సి వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శేషపు అశ్రియ్య మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసి ఇక్కడ సౌకర్యాలు కల్పించుకుంటే ఇప్పుడు పొక్లెయిన్ తీసుకొచ్చి బెదిరించడం దారుణమన్నారు.

ఇళ్ల స్థలాల పోరాట సాధన కమిటీ ఏర్పాటు

సమావేశం అనంతరం ఇళ్ల స్థలాల పోరాట సాధన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా పెచ్చెట్టి సత్యనారాయణ, సభ్యులుగా నాగవరపు ఈశ్వరి, పాలా లక్ష్మి, మల్లుల నాగలక్ష్మి, వేల్పూరి దుర్గ, తమ్మినేని వెంకటలక్ష్మి, జోగి నాగరాజు, సంపతరావు, భాస్కరరావు, తనపల త్రిమూర్తులు, నాగవరపు కొండలరావులను ఎన్నుకున్నారు. ప్రభుత్వ అధికారులు పేదల ఇళ్లు కూల్చే నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టాలని సాధన కమిటీ నిర్ణయించింది.

రైతులకు సొసైటీలు విస్తృత సేవలందించాలి

ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

రైతులకు సహకార సంఘాలు విస్తృత సేవలందించాలని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ కోరారు. మంగళవారం ఆచంటలో ది మృత్యుంజయ విశాల సహకార పరపతి సంఘంలో ఆచంటలో నాబార్డు నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన ఎంపిఎఫ్‌సి గొడౌన్‌ను ఆయన ప్రారంభించారు. గత ఐదేళ్ల పాలనలో సహకార వ్యవస్థను జగన్‌రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం సహకార వ్యవస్థలో జీవం పోసేందుకు కృషి చేస్తుందని చెప్పారు. రానున్న ఆరు నెలల్లో సహకార సంఘాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, నీటి పంపిణీ సంఘం అధ్యక్షులు తమ్మినీడి రామకృష్ణ వరప్రసాద్, టిడిపి మండలాధ్యక్షులు కేతా మీరయ్య, నేతలు బొక్కా లీలా సుబ్రమణ్యం, నెక్కంటి ప్రభాకర్‌రావు, తమ్మినీడి పృధ్వీకుమార్, కోళ్ల సత్యనారాయణ, తెలుగు యువత అధ్యక్షులు కేతా మురళీ, కమ్మ సత్యనారాయణ, సంఘ ఛైర్‌పర్సన్ శీలబోయిన శ్రీనివాసరావు, కార్యదర్శి యాండ్ర విష్ణుమూర్తి, రైతులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఎంపిఎఫ్‌సి గోదామును ప్రారంభించిన ఎంఎల్ఎ పితాని

జెసిచే ఇరిగేషన్ స్థలం పరిశీలన

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరంలోని మహాత్మాగాంధీ కేన్సర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సమీపంలోని నీటిపారుదల శాఖకు సంబంధించిన మూడున్నర ఎకరాల భూమిని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. మంగళవారం ఆయన ఆ భూమిని సంబంధిత శాఖాధికారులతో కలిసి పరిశీలించారు. మ్యాపుల ఆధారంగా స్థలాన్ని నిశితంగా పరిశీలించారు. కలెక్టరేట్‌కు నుండి ఈ స్థలం వరకు ఎంత దూరం, భీమవరం పట్టణానికి ఎంత దూరం అనేది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఈ స్థలాన్ని పరిశీలించామన్నారు. ఈ భూమికి సంబంధించిన వివరాలపై పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. జాయింట్ కలెక్టర్ వెంట ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా నీటిపారుదల శాఖాధికారి పి.నాగార్జునరావు, జిల్లా ఇన్‌ఛార్జి డ్రెయినేజీ అధికారి సిహెచ్.సత్యనారాయణ, ఆర్అండ్‌బి డిఇ రామరాజు, తహశీల్దార్ జి.సుందర్‌సింగ్, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

సమస్యల పరిష్కారానికి కమిటీలు : ఆర్‌డిఒ దాసి రాజు

ప్రజాశక్తి - నరసాపురం

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తామని ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. మంగళవారం మండలంలోని దర్భరేవు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన విచ్చేసి ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ పెండింగ్ భూసమస్యలు, ఆన్‌లైన్‌లో పేర్ల చేర్పులు, మార్పులు, పట్టాదారు పాస్ పుస్తకాలు, సర్వే సరిహద్దుల సమస్యలు ఉంటే ఈ సదస్సుల్లో పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించినా, కబ్జా చేసినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కంపెనీల భూముల రిజిస్ట్రేషన్ ఇంకా చేయాల్సి ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో ఎకరం భూమి ఆక్రమణకు గురైందని చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆర్‌డిఒకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి విజయలక్ష్మి, కొరిపల్లి వాసు, వాతాడి ఉమా, సజ్జా వాసు, కొల్లు రాజు, భూపతి వేణు తదితరులు పాల్గొన్నారు.


ప్రజలు వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న ఆర్‌డిఒ దాసిరాజు

విద్యుద్దీపాలతో చర్చిలు ముస్తాబు

క్రైస్తవ సోదరులు మొగల్తూరులు మండలంలో చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. మొగల్తూరులోని ఆర్‌సిఎం చర్చి, పాలపర్తివారిపేటలోని లూథరన్ చర్చిల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని క్రీస్తు పుట్టిన పశువుల పాక, తదితర వాటిని ప్రత్యేకంగా అలంకరించారు. వాటికి విద్యుద్దీపాలను ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వాటిని చూసేందుకు ప్రజలు ఆసక్తి కనబర్చారు. మంగళవారం రాత్రి నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే తణుకు పట్టణంలో చర్చిలు విద్యుద్దీపాలతో కళకళలాడుతున్నాయి.

తణుకులో..

మొగల్తూరులో..

విఇసి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా రామచంద్రరావు

ప్రజాశక్తి - వీరవాసరం

స్థానిక విఇసి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా చింతగుంట రామచంద్రరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నారాయణపురం మహాత్మగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకులుగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై వీరవాసరం కళాశాల ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. ఈయన 2004లో ఎపిపిఎస్‌సి ద్వారా ఎంపికై నెల్లూరు జిల్లాలో అధ్యాపకుడిగా బాధ్యతలు చేపట్టి ఆ తరువాత మాధవరం, తాడేపల్లిగూడెం, నారాయణపురం కళాశాలల్లో పని చేశారు. ఇక్కడ ప్రిన్సిపల్‌గా బాధ్యత చేపట్టిన రామచంద్రరావు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల సంఖ్యతోపాటు ఉత్తీర్ణతా శాతం పెంచడానికి కృషి చేస్తానన్నారు. ఈయనకు కళాశాల అధ్యాపకులు సిహెచ్.ప్రభువరం, ఎన్.సురేష్, ఎం.బలరామ్ అభినందనలు తెలిపారు.

ప్రతి సోమవారమూ ఉచిత బస్సు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్ఎస్ అర్జీదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రతి సోమవారమూ ప్రత్యేక ఉచిత బస్సు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పిజిఆర్ఎస్ అర్జీదారులు ప్రతి సోమవారమూ కలెక్టరేట్లో నిర్వహించే కార్యక్రమానికి రావడానికి పడుతున్న ఇబ్బందులు జిల్లా కలెక్టర్ దృష్టికి వచ్చిన వెంటనే, దీనిపై ఆలోచన చేసి సమస్యను పరిష్కరించడం జరిగింది. మెయిన్ రోడ్డు నుండి కలెక్టరేట్కు వృద్ధులు, వికలాంగులు చేరుకోవాలంటే రెండున్నర కిలోమీటర్లు ప్రయాణించాల్సి రావడం వ్యయ ప్రయాసలతో పాటు ఖర్చుతో కూడుకుంది. ఈ విషయమై డిఇఒతో చర్చించి ప్రతివారమూ ఒక స్కూల్ బస్సు రెండు ట్రిప్పులు వేసేలా చర్యలు తీసుకున్నారు. ఆర్టిసి కాంప్లెక్స్ నుండి సుమారు ఉదయం 9 గంటలకు, 10 గంటలకు, అలాగే తిరిగి కలెక్టరేట్ నుండి మధ్యాహ్నం 12 గంటలకు, మధ్యాహ్నం 1 గంటకు వృద్ధులు, వికలాంగ పిజిఆర్ఎస్ అర్జీదారులకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఫసల్ బీమాను వినియోగించుకోవాలి

వ్యవసాయశాఖ ఎడిఇ డాక్టర్ అనిల్ కుమారి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఎడిఇ డాక్టర్ అనిల్ కుమారి తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా రూ.615 చెల్లించి రైతులు, కౌలు రైతులు బీమాలో నమోదు కావాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తక్కువ ఖర్చుతో రైతులు అధిక రక్షణ పొందొచ్చన్నారు. ప్రస్తుతం సబ్ డివిజన్ పరిధిలో 4 వేల మంది రైతులు ఉన్నారన్నారు. ఈ నెలాఖరు నాటికి ఎక్కువ రైతుల చేత కట్టించే విధంగా సిబ్బందికి అదేశాలు జారీ చేసినట్లు ఎడిఇ తెలిపారు.

పెన్సిల్ లెడ్పై క్రీస్తు ప్రతిమ



ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని రుస్తుంబాదకు చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారులు, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత కొప్పినీడి విజయమోహన్ క్రిస్మస్ను పురస్కరించుకొని పెన్సిల్ లీడ్పై ఏసుక్రీస్తు ప్రతిమను చెక్కారు. ఇది తయారు చేయడానికి ఎటువంటి సూక్ష్మ పరికరాలను ఉపయోగించకుండా కేవలం గంటన్నర వ్యవధిలో తయారు చేశారు. విజయ్ వృత్తిరీత్యా మండలంలోని లిఖితపూడి సచివాలయంలో సర్వేయర్ పనిచేస్తూ తన ప్రతిభను కనబర్చాడు. ఈ కళాఖండాన్ని పలువురు అభినందించారు.

రేషన్ డీలర్ల నేత సూర్యచంద్రరావు మృతి

సూర్యచంద్రరావు (ఫైల్ఫొటో)

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణానికి చెందిన పెరుమాళ్ల సూర్యచంద్రరావు (78) మంగళవారం మృతి చెందారు. ఆయన రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి, జిల్లా కోశాధికారి, రేషన్ డీలర్ల సమాఖ్య మండల కార్యదర్శిగా పని చేశారు. ఆయన మృతికి ప్రభుత్వ విప్ నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, ఆర్డిఒ దాసి రాజు, తహశీల్దార్ రాజరాజేశ్వరి, సిపిఐ నాయకులు నెక్కంటి సుబ్బారావు, టిడిపి ఇన్ఛార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షులు అధికారి ఏసు, వెంకట నరసయ్య, సమయమంతుల సర్వేశ్వరరావు, కె.అనంత సత్య వెంకట సుబ్బారావు ఆయన భౌతికయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

వైసిపి ఐటి వింగ్ జిల్లా అధ్యక్షునిగా సుమన్

ప్రజాశక్తి - నరసాపురం

వైసిపి ఐటి వింగ్ జిల్లా అధ్యక్షునిగా రెండోసారి నరసాపురానికి చెందిన బుడితి సుమన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సుమన్ మంగళవారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసే ప్రజా వ్యతిరేక పాలనపై నిరంతరం ప్రశ్నిస్తూ వైసిపి పోరాటం చేస్తోందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ కూటమి ప్రభుత్వానికి గుర్తు చేస్తూ ఉంటామన్నారు. దోచుకో దాచుకో, పంచుకో పంథాలోనే కూటమి ప్రభుత్వం పరిపాలన ఉందన్నారు.

బీమా చెక్కు పంపిణీ

తణుకు రూరల్: మృతుని కుటుంబానికి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన చెక్కును దువ్వ యూనియన్ బ్యాంకు బ్రాంచి మేనేజర్ వి.దివ్య, అసిస్టెంట్ మేనేజర్ మోహన్ మంగళవారం బ్యాంకులో అందజేశారు. బ్యాంకులో బీమా కింద సంవత్సరానికి రూ.436 ప్రీమియం కట్టిన బ్యాంకు ఖాతాదారుడు మద్దూరి లక్ష్మీనారాయణ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. నామినీగా ఉన్న లక్ష్మీనారాయణ భార్య అన్నపూర్ణకు స్టార్ యూనియన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా రూ.రెండు లక్షల బీమా చెక్ అందజేశారు.

డ్వాక్రా గ్రూప్ సభ్యుల నిరసన

పోలవరం: మారుమూల పల్లెల్లో ఉంటూ స్వయం సమృద్ధి సాధించేందుకు డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసుకుంటే, ఆదివాసీలకు అప్పులు చూపించారు. ఒకటి, రెండూ కాదు ఏకంగా రూ.10 లక్షలు అప్పు చెల్లించాల్సిందే అంటూ బ్యాంకర్లు ఆ డ్వాక్రా గ్రూపు సభ్యులకు హుకుం జారీ చేశారు. నివ్వెరపోయిన గిరిజనులు పోలవరంలోని మండల సమైక్య వెలుగు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పోలవరం మండలం ఉడతపల్లి, మెత్తప్ప కోట మారుమూల కొండకోనల్లో ఉన్న గిరిజన గ్రామాలు డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసుకున్నారు. ఉడతపల్లిలో మూడు డ్వాక్రా గ్రూపులు, మెత్తప్ప కోటలో ఏడు డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. ఉడతపల్లిలో ఉన్న మూడు గ్రూపులకు సంబంధించి రుణం తీసుకోకపోయినా ఉన్నత శ్రీ నిధి నుంచి రూ.5 లక్షల 50 వేలు బాకీ ఉందని వెలుగు అధికారులు, బ్యాంకర్లు చెప్పడంతో నివ్వెరపోయారు. ఈ గ్రూపుల సభ్యులు ఎవరూ రుణాలు పొందలేదు. ఏ రుణం తీసుకోకపోయినా ఐదున్నర లక్షల బాకీ చూపించే సరికి ఒక్కసారి షాక్కు గురయ్యారు. కూలీకి వెళ్తేగానీ పొట్టగడవని నిరుపేద గిరిజన సభ్యులు రుణం పొందకుండా ఎలా కడతామని ప్రశ్నించినా, కట్టి తీరాలంటూ అధికారులు హుకుం జారీ చేశారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు పొదుపు ఖాతాల్లో ఉన్న సొమ్ము కూడా మాయమవుతోందని వాపోతున్నారు. డ్వాక్రా గ్రూపులకు ఉన్నత శ్రీనిధి కింద ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందుతుంటుంది. అసలు ఆ పథకం కింద కూడా ఎటువంటి సొమ్ము పొందలేదని అమాయక గిరిజనులు వాపోతున్నారు. ఇక మెత్తప్పకోట గ్రామ సమాఖ్యలో డ్వాక్రా సంఘాలకూ రూ.10 లక్షల 67 వేల 614 అప4గా ఉందని అధికారులు చూపించారు. ఈ గ్రూపులలో అభినందన గ్రూప్కి రూ.1,50,000, శ్రీ సూర్య గ్రూప్కి రూ.లక్ష 50 వేలు, శ్రీ శాంతి గ్రూప్కి రూ.2 లక్షల 50 వేలు అప్పుందని వెలుగు అధికారులు వారిని వేధిస్తున్నారు. రెండున్నర ఏళ్ల క్రితం పెట్టుకున్న శ్రీశాంతి గ్రూపుకు కూడా రూ.2 లక్షల 50 వేల లోన్ ఉండడం గమనార్హం. మీరు రుణం చెల్లించలేదు కాబట్టి మండల సమైక్య నుంచి వచ్చే పథకాలేవీ వర్తించవని అధికారులు స్పష్టం చేశారని సభ్యులు వాపోతున్నారు. అస్సలు తాము ఏ అప్పు తీసుకోలేదని తుమ్మల కాంతమణి, తుమ్మల కృష్ణవేణి, కత్తుల సీతారామలక్ష్మి, ములెం సుభద్ర, యండపల్లి సూర్య కుమారి, గోరం లలిత, మూలెం రామలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. పల్లవి డ్వాక్రా గ్రూపు వారు బ్యాంక్ నుంచి లోన్గా రూ.7 లక్షల 50 వేలు తీసుకున్నామని, దానికి తాము రూ.12 లక్షల 61 వేలు విఒఎకు చెల్లించామని బక్కా విజయలక్ష్మి, మడకం లక్ష్మి చెప్పారు. బాకీ తీరిపోయినా ఇంకా అప్పు చెల్లించాలని అంటున్నారని వాపోయారు. తమకు జరిగిన అన్యాయాన్ని సరిచేసి అవినీతి అక్రమాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కాళ్ల :మాట్లాడుతున్న ముఖ్యవక్తమానికులు లాజరస్

మార్టేరు వివేకానంద స్కూల్లో..

ప్రజాశక్తి - కాళ్ల

క్రీస్తు బోధనలు, సందేశం యావత్ ప్రపంచానికి ఆదర్శనీయమని ముఖ్య వక్తమానికులు పిఎస్.లాజరస్ పిలుపునిచ్చారు. కాళ్లలోని బేతేలు ప్రార్థనా మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ చాలా ప్రత్యేకమైందన్నారు. సంఘకాపరి వి.జాన్కెనడీ మాట్లాడుతూ 50 ఏళ్లుగా బేతేలు ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు పోతుల డేవిడ్జాన్, వి.రాజ్కుమార్, పి.అక్షయ్ స్టీఫెన్, సంఘం పెద్దలు వి.అబ్రహం, కృపాబాయి, ప్రియాంక పాల్గొన్నారు.



తణుకులో కేక్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

గణపవరం : గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గణపవరం సర్పంచి మూరా అలంకారం, డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. పిప్పర, పెంటపాడు, పూళ్ల, ఉంగుటూరు మండలాలకు చెందిన ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తణుకు : క్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శనీయమని మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు అన్నారు. మంగళవారం మాంటిస్సోరి స్కూల్ ఆవరణలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శాంతాక్లాజ్ శుభాశీలస్సులతో పాటు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏసు క్రీస్తు ఆశీస్సులు ప్రతి కుటుంబంపైనా ఉండాలని తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయం వద్ద క్రిస్మస్ పండుగ నేపథ్యంలో నియోజకవర్గంలోని సుమారు 450 చర్చిలకు క్రిస్మస్ కేక్లు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా పెద్ద ఎత్తున క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తూ, ఏసుక్రీస్తు బోధనలు అనుసరిస్తూ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని సమాజంలోని సేవకులందరూ ఆనందంగా, సంతోషంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మార్టేరు వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మంగళవారం ఈవ్ సందర్భంగా సెమీ క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. విద్యార్థులు వేసిన యోకోబు, మరియమ్మ, గొల్లలు, జ్ఞానులు, గాబ్రేయాలు, దేవదూత, శాంత క్లాజ్ వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ గుడిమెట్ల రామారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిసి హాస్టల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

బిసి సంక్షేమ సంఘం పాలకొల్లు అధ్యక్షునిగా ముత్యాలరావు

ముత్యాలరావుకు నియామకం పత్రం అందజేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - పాలకొల్లు

బిసి బాలికల హాస్టల్లో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని బిసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని తెలిపారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం పాలకొల్లు నియోజకవర్గ సమావేశం స్థానిక ప్రెస్క్లబ్లో మంగళవారం బిసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ భవాని మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖా మంత్రి వాసం శెట్టి సుభాష్ను కలిసి బిసి హాస్టల్లో విద్యార్థుల సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించినట్లు చెప్పారు. ఈ నెల 23న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, బిసి వెల్ఫేర్ సమావేశం ఏర్పాటు చేసి బిసి బాలికల హాస్టల్లో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ఎనిమిది నెలలుగా మెస్ ఛార్జీలు ఇవ్వడం లేదని వాటిని కూడా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బిసిలకు ఉన్న 24 శాతం రాజకీయ రిజర్వేషన్లు, 34 శాతానికి పెంచి చట్టబద్ధత కల్పించాలని తీర్మానం చేయడం శుభ పరిణామమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ చట్ట సభల్లో బిసిలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్ మాట్లాడుతూ బిసి జాబితాలోని రాజకీయ రిజర్వేషన్లు ఎబిసిడిలుగా అమలు చేయాలని కోరారు. పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్షునిగా పొన్నమండ ముత్యాలరావును నియమిస్తూ సమావేశం నిర్ణయించింది. రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా అధ్యక్షులు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా అమలు చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి, జల వనరుల శాఖ మంత్రికి, కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రికి సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సమావేశంలో వింజరపు శంకరం, కోరుకొండ సుబ్బారావు, తమ్మిరీ వెంకటేశ్వరరావు, నీలంశెట్టి సత్యప్రసాద్, వేనేతల దుర్గారావు, వీరవల్లి కృష్ణ, వందరాపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసిపి పోరుబాట పోస్టర్ విడుదల

పాలకొల్లు : పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి అధినేత జగన్మోహన్రెడ్డి పిలుపుమేరకు వైసిపి కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన జరిగే కరెంట్ ఛార్జీలు బాదుడుపై వైసిపి పోరుబాట పోస్టర్ను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికల ముందు టిడిపి ఇచ్చిన హామీలు 8 నెలలైనా అమలు చేయలేదని నియోజకవర్గ ఇన్ఛార్జి గుడాల గోపి విమర్శించారు. సమావేశంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, కండవల్లి వాసు, స్టాలిన్ బాబు, కోరాడ శ్రీను, భావ నారాయణ పాల్గొన్నారు.

కాళ్ల: పెదఅమిరంలో వైసిపి ఆధ్వర్యంలో చేపట్టనున్న విద్యుత్ ఛార్జీల పోరుబాట కార్యక్రమ పోస్టర్ను వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్ఛార్జి పివిఎల్ నరసింహరాజు చేతులమీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ జగన్మోహన్రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 27న జరిగే ఛార్జీల బాదుడుపై వైసిపి పోరుబాట కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు గణేశ్న రాంబాబు, పివి ఆర్కే ఆంజనేయరాజు పాల్గొన్నారు.

లేసు ట్రేడింగ్ సెంటర్లో షూటింగ్ సందడి

ప్రజాశక్తి - నరసాపురం

లేసు ప్రాముఖ్యతను ప్రపంచ వ్యాప్తంగా తెలియజేసేందుకు నేషనల్ జ్యాయోగ్రాఫికల్ ఛానల్ మంగళవారం రుస్తుంబాదలోని ఇంటర్నేషనల్ లేసు ట్రేడింగ్ సెంటర్లో షూటింగ్ నిర్వహించారు. ముంబాయి నుంచి మోడల్స్ను రప్పించి కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. సాయంత్రం ఎల్బిచర్ల, కలవకొలను తాతాజీ లేసు కంపెనీల్లో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. రెండు రోజులుగా మార్కెట్, లేసు పార్కుల్లో పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ అల్లికలు దేశానికి ఎలా వచ్చాయి, ఈ ప్రాంతంలో ఎలా ప్రాచుర్యం అయ్యాయి, విదేశాల ఎగుమతి తదితర అంశాలను ప్రజలకు తెలియజేయాలన్న లక్ష్యంతో ఈ ఛానల్ బయోఫిక్ (డాక్యుమెంటరీ) రూపొందిస్తోంది. 40 ఏళ్ల క్రితం నరసాపురం ప్రాంతానికి ఒక లేసు కుటుంబం ముంబాయి వెళ్లి స్థిరపడుతుంది. మళ్లీ చాలా ఏళ్ల తరువాత ఆ కుటుంబానికి చెందిన ఒక మహిళ ఈ ప్రాంతానికి వచ్చి లేసు వస్తువుల్ని కొనుగోలు చేస్తుంది. ఈ కథాంశంపై డాక్యుమెంటరీని తయారు చేస్తున్నట్లు చిత్ర యూనిట్ చెప్పింది. ఈ సన్నివేశాల లోకేషన్లు, లేసు వస్తువులను లేసు ట్రేడ్ కన్వీనర్ కలవకొలను తులసీరావు సమకూర్చుతున్నారు.

సన్నివేశాలను చిత్రీకరిస్తున్న యూనిట్

ఆలయాల అభివృద్ధికి చర్యలు : ఎంఎల్ఎ పితాని

ప్రజాశక్తి - పోడూరు

నియోజకవర్గంలో ఆలయాలను శ్రీవాణి టెంపుల్ నిర్మాణ అభివృద్ధి నిధులతో అభివృద్ధి చేసేందుకు రూపొందించిన ప్రతిపాదనలకు త్వరితగతిన ఉన్నతాధికారుల ఆమోదం పొందాలని ఆచంట ఎంఎల్ఎ, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం సాయంత్రం కొమ్ముచిక్కాలలోని తన క్యాంపు కార్యాలయంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఎండోమెంట్ ఇన్స్పెక్టర్లు, ఆలయాల కార్యనిర్వహణాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పితాని మాట్లాడుతూ వారం రోజుల్లో దేవాలయాల ధర్మకర్తల మండలి నోటిఫికేషన్ విడుదల కానుందని, వెంటనే దరఖాస్తులు స్వీకరించి ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం చేపట్టాలని కోరారు. ఇప్పటికే పుష్కర్ ఘాట్లు అన్నీ పరిశీలించామని, వాటి నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సిజిఎఫ్ నిధుల నుండి ఆలయ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారులకు అధిక టెంపుల్స్ నిర్వహణ ఉండటంతో రాబోయే రోజుల్లో పుష్కరాల కాలంలో పని భారం పెరుగుతుందన్నారు. మేనేజ్మెంట్ చేయలేని అధికారుల స్థానంలో కొత్తవారి నియామకం చేపట్టాలని కోరారు. సిద్ధాంతంలోని కేదార్ ఘాట్ సుందరీకరణకు ప్రణాళికలు రచిస్తున్నామని, నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖాధికారి ఇవి.సుబ్బారావు, అధికారులు వి.వెంకటేశ్వరరావు, జి.రామపెద్దింట్లు, ఆదిమూలం వెంకట సత్యనారాయణ, ముత్యాల సత్యనారాయణ, పిల్లి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిజాలను నిర్భయంగా రాసేదే ప్రజాశక్తి

ఎంఎల్ఎ సొంగ రోషన్ కుమార్

చింతలపూడి: నిజాలను నిర్భయంగా రాయడంలో ప్రజాశక్తి దినపత్రిక ముందుంటుందని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగ రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడిలోని ఎంఎల్ఎ కార్యాలయం వద్ద ప్రజాశక్తి 2025 నూతన క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రోషన్కుమార్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావటంలో ప్రజాశక్తి ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవా, జనసేన మండల అధ్యక్షులు చిదరాల మధుబాబు పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ

బుజ్జి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయింపు

అసంపూర్తిగా ఉన్న పనులన్నీ పూర్తి: మేయర్ నూర్జహాన్

ఏలూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మాజీ ఎంఎల్ఎ బడేటి కోట రామయ్య (బుజ్జి) విగ్రహం ఏర్పాటుకు కలెక్టరేట్కు వెళ్లే మార్గంలో జెడ్పి కార్యాలయానికి సమీపంలో స్థలం కేటాయింపునకు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలిపింది. కౌన్సిల్ సమావేశం మేయర్ షేక్ నూర్జహాన్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో 19 అంశాలతో కూడిన ఎజెండాను కౌన్సిల్ సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణతో చర్చించి సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. మేకల కబేలా నిర్వహణకు అనుభవజ్ఞుడైన డాక్టర్ను నియమించాలని నిర్ణయించామన్నారు. కార్పొరేషన్ పరిధిలో పని చేసే అవుట్సోర్సింగ్ సిబ్బంది ఎవరైనా మరణిస్తే మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు చెల్లించాలని కౌన్సిల్ నిర్ణయించిందని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో నిధుల్లేక పనులేవీ చేపట్టలేకపో యామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నుంచి విడుదలవుతున్న నిధులతో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేస్తున్నామని, మిగిలిన వాటిపై ఎంఎల్ఎతో చర్చించి ప్రాధాన్యతాక్రమంలో చేపడుతున్నట్లు తెలిపారు. పలుచోట్ల సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టామన్నారు. సమావేశంలో కమిషనర్ భానుప్రతాప్, అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - వీరవాసరం

గ్రామాల్లో ప్రతిరోడ్డూ సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తానని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల పనులను మంగళవారం ఎంఎల్ఎ ప్రారంభించారు. మడుగుపోలవరంలో జగనన్నకాలనీలో రూ.18 లక్షల వ్యయంతో నిర్మించబోయే 180 మీటర్ల సీసీ రోడ్డుకు ఇదేవిధంగా నందమూరిగరువు, మత్స్యపురిపాలెం గ్రామాల్లో ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయిస్తానన్నారు. అలాగే నేలపోగుల వరకూ లింక్ రోడ్డు ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి బోణం వెంకట పరమేశ్వరరావు, ఎంపిపి దుర్గా భవానీ చంద్రశేఖర్, యరక రాజు హరిబాబు, టిడిపి గ్రామ అధ్యక్షుడు దొంగ రామకృష్ణ, జనసేన గ్రామ అధ్యక్షుడు బోనం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించని వారికి నోటీసులు

మున్సిపల్ కమిషనర్ అంజయ్య

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో ఇంటి పన్ను చెల్లించని వారికి నోటీసులు జారీ చేశామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులు చెల్లించి నరసాపురం మున్సిపాల్టీ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. బకాయిలు చెల్లించని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బకాయిలు చెల్లించాలని నోటీసులతో పాటు మైక్ ద్వారా ప్రచారం చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నానాజీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆర్థిక సాయంతోనే సిపిఎం ఉద్యమాలు

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రజల ఆర్థిక సహకారంతోనే సిపిఎం ప్రజా ఉద్యమాలు చేపడుతోందని సిపిఎం మండల కార్యదర్శి బొర్రా ఆలమహారాజు అన్నారు. ఆలమహారాజు ఆధ్వర్యంలో మంగళవారం మాస్ క్యాంపెయిన్ జరిగింది. రెండు రోజులుగా వీరవాసరంలో మాస్ క్యాంపెయిన్కు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ప్రజలంతా తమ వంతుగా వారికి తోచినంత ఆర్థిక సాయం చేస్తున్నారు. ప్రజల ఆర్థిక తోడ్పాటుతో సిపిఎం మరింత చురుగ్గా ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తుందని పార్టీ నాయకులు అంటున్నారు. ఈ కార్యక్రమంలో యండమూరి సుబ్బారావు, రెడ్డి రామారావు, గొట్టుముక్కల శ్యాంబాబు, పోతుల మృత్యుంజయులు పాల్గొన్నారు.

27న వాలీబాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - పెనుమంట్ర

జనవరి 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ రాజస్థాన్ రాష్ట్రం లోని జైపూర్లో జరగనున్న సీనియర్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఆంధ్ర రాష్ట్రం నుంచి సీనియర్ మహిళలు, పురుషుల జట్ల ఎంపిక ఈనెల 27న జరగనుందని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎం.రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక ఇందరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే సీనియర్ మహిళలు, పురుషుల జట్ల ఎంపికలో పాల్గొనేందుకు ఆసక్తి గల వాలీబాల్ క్రీడాకారులు ఉదయం 7.00 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు. హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు, నేటివిటీ సర్టిఫికెట్, 10 పాస్పోర్ట్ ఫొటోలతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, ఎన్టిఆర్ జిల్లా విజయవాడలోని వాలీబాల్ కోర్టు వద్ద హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

CHANGE OF NAME

I, MOHAMMED ARSHUYA ZAKEER SHAREF W/O MOHAMMED ZAKEER SHAREF R/o D.No. 1-167/1, L.G APPARMENT,ROAD No.12,NEAR MOSQUE,DWARAKA NAGAR,B D COLONY, ELURU TOWN & DISTRICT A.P. INDIA, HAVE CHANGED MY DAUGTER'S NAME ZAREENA SHAREF TO MOHAMMED ZAREENA SHAREF SAMEAS INTIMATED TO THE

CHANGE OF NAME

I, MOHAMMED ARSHUYA ZAKEER SHAREF W/O MOHAMMED ZAKEER SHAREF R/o D.No. 1-167/1, L.G APPARMENT,ROAD No.12,NEAR MOSQUE,DWARAKA NAGAR,B D COLONY, ELURU TOWN & DISTRICT A.P. INDIA, HAVE CHANGED MY NAME ZAKEER SHAREF ARSHUYA TO MOHAMMED ARSHUYA ZAKEER SHAREF SAMEAS INTIMATED TO THE

పురపాలక సంఘ కార్యాలయం

ఆర్.ఓ.సి.నెం.e-1664603/ఏ1,2019, తణుకు, ది.24.12.2024

బహిరంగ వేలం నోటీసు

తణుకు పురపాలక సంఘ వీక్లి మార్కెట్-2లో దిగువ తెలిపిన షాపులకు 3 సంవత్సరముల కాలంకు నెలసరి అద్దె విలువల పై లీజుకు ఇచ్చుటకు పురపాలక సంఘ కార్యాలయములో ది.31-12-2024వ తేదీన ఉదయం గం.11.00లకు కమీషనర్ వారిచే గాని, వారి అనుమతి పొందిన ఇతర అధికారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.నెం.	షాప్ నెంబర్లు	ప్రతిపాదించిన	డిపోజిట్	సాల్వెన్సీ
1	1,2,3,4,5,6,7,8,10,11,13	4617/-	20000/-	100000/-
2	9 మరియు 12 SC కేటగిరి	2310/-	10000/-	100000/-

పై పట్టికలో చూపన సాల్వెన్సీ మరియు డిపోజిట్ సమర్పించిన వారిని మాత్రమే పాటలో పాల్గొనుటకు అనుమతించబడును. పాటను వాయిదా లేక రద్దు పరుచుటకు ఈ కార్యాలయము అధికారం కలిగియున్నది. వివరములు కొరకు ఆఫీసు పని దినములలో సంప్రదించవలెను.

సం/- కమిషనర్
తణుకు పురపాక సంఘం.